**అమ్మల మీద ప్రభావం!**

ఉద్యోగాలలో స్త్రీ పురుష సమానత్వం గురించి ఎంత చెప్పుకొన్నా... క్షేత్ర స్థాయిలో ఉన్న సవాళ్లు వేరు. మగవారు రోజుకు 18 గంటలు ఆఫీసులో గడిపినా, ఇంటి మీద అంత ప్రతికూల ప్రభావం ఉండక పోవచ్చు కానీ పిల్లలున్న మహిళల సంగతి అలా కాదు. ఉద్యోగంతోపాటు ఇంటినీ, పిల్లలనూ చూసుకోవాల్సిన పరిస్థితులు ఇంకా ఉన్నాయి. ఇప్పటికే కెరీర్ కొనసాగించే తల్లుల పట్ల కనిపించని వివక్ష ఉందని ఎన్నో నివేదికలు తేల్చాయి. ఉద్యోగావకాశాల దగ్గర నుంచి పదోన్నతుల వరకు వారిని కాస్త తక్కువగా ఎంచుతారని ఇవి స్పష్టం చేస్తున్నాయి. వీటికి మదర్‌హుడ్ పెనాల్టీ, మెటర్నల్ వాల్ లాంటి పేర్లు సైతం పెట్టారు. ఇక వారానికి 70 గంటలు పని చేయాలనే అనధికారిక నిబంధన వీరి మీద చూపించే ప్రభావం అంత సానుకూలం కాదన్నది విశ్లేషకుల అంచనా!

## తమిళనాట ఓ విఫల యత్నం



గత ఏడాది ఏప్రిల్‌లో తమిళనాడు ప్రభుత్వం ఓ వివాదాస్పద చట్టానికి రూపకల్పన చేసింది. రోజువారీ పనివేళలను 8 గంటల నుంచి 12 గంటలకు పెంచడం ఈ చట్టం ఉద్దేశం. ఇలా చేయడం వల్ల యువతకు ఎక్కువ ఉపాధి లభిస్తుందనీ, రాష్ట్రానికి మరిన్ని పెట్టుబడులు వస్తాయనీ చెప్పుకొచ్చింది ఆ ప్రభుత్వం. శాసనసభలో అధికార పార్టీకి మంచి మెజారిటీ ఉండటం వల్ల, మూజువాణీ ఓటుతో ఆ చట్టాన్ని అమలులోకి తెచ్చింది. ఈ విషయం వార్తల్లో రాగానే, కార్మిక వర్గాలు భగ్గుమన్నాయి. అసలే అరకొర జీతాలు, అదనపు సౌకర్యాలేవీ లేని ఉద్యోగాలు. ఈ నేపథ్యంలో పనిచేసే ఫ్యాక్టరీ కార్మికుల సగం రోజును పనిగంటలుగా మార్చడం ఏమిటంటూ... నిరసన వ్యక్తమైంది. దాంతో మూడు రోజుల్లోనే రాష్ట్ర ప్రభుత్వం ఆ చట్టాన్ని వెనక్కి తీసుకోవాల్సి వచ్చింది.




ఈ 70 పనిగంటల చర్చ అంత తేలికగా ముగిసేది కాదు. ఉద్యోగులతోపాటు వైద్య నిపుణులు కూడా దీని పట్ల అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. 'నీకంటూ ఓ సామాజిక జీవితం ఉండదు. కుటుంబంతో గడిపేందుకు, వ్యాయామం చేసేందుకు, సేద తీరేందుకు సమయం ఉండదు. ఇక ఇంటికి వచ్చాక కూడా గమనించుకోవాల్సిన కాల్స్, మెయిల్స్ గురించి చెప్పనక్కర్లేదు. మరి చిన్న వయసులోనే గుండెపోట్లు రావడంలో ఆశ్చర్యం ఏముంది?' అంటారు దీపక్ కృష్ణమూర్తి అనే హృద్రోగ నిపుణులు. 'నారాయణమూర్తిగారు 70 గంటలు అన్న ఉద్దేశం వేరు. 40 గంటలు కంపెనీ కోసం పనిచేయాలి, 30 గంటలు మనల్ని మనం మెరుగుపర్చుకునేందుకు పనిచేయాలి' అని విశ్లేషించారు టెక్ మహీంద్రా మాజీ సీఈవో సి.పి. గుర్నాని. ఏదేమైనా, ఓ వ్యక్తి ఒత్తిడితో కాకుండా నిబద్ధతతో, వారానికి 70 గంటలు సంతోషంగా పని చేయాలి అంటే... తన ఎదుగుదల కూడా ఉంటుందన్న భరోసా ఉండాలి. మధ్యమధ్యలో విరామం తీసుకునేందుకు, సేద తీరేందుకు తగిన సౌకర్యాలు ఉండాలి. అదనపు పని గంటలకు ఆర్థికంగా ప్రతిఫలం ఉండాలి. పని ఒత్తిడి నుంచి సేద తీరేందుకు తగినన్ని సెలవులు అందించాలి. ఇవన్నీ కనుక ఓ సంస్థ అందించగలిగితే 70 గంటల పని చేసేందుకు యువత సిద్ధంగానే ఉంటుంది. ఓ సీఈవో తన సంస్థ కోసం పనిచేయడం వేరు. అది తన ప్రాణం, తన భవిష్యత్తు, తన కసి. కానీ ఓ ఉద్యోగి తన వ్యక్తిగత సుఖసంతోషాలను పణంగా పెట్టి, విలువైన వయసును కరిగించి తను పనిచేసే కంపెనీ కోసం 70 గంటలకు మించి పనిచేయాలి అంటే... అందుకు తగిన వాతావరణం, ప్రతిఫలం సంస్థ నుంచి ఆశించడంలో తప్పు లేదు. అన్నిటికీ మించి ఎంతసేపు పని చేశాం అనే ప్రశ్న కంటే ఎంత నైపుణ్యంగా, సమర్థంగా పనిచేశాం అనేదే పని విలువను నిర్ణయిస్తుంది! ■

## పని రోజులు తగ్గించే ప్రయత్నాలు

ఓ పక్క వారానికి 70 రోజులు పనిచేయాలని నారాయణమూర్తి లాంటి కార్పొరేట్ నాయకులు కోరుకుంటూ ఉంటే... మరోవైపు తమ దేశంలో పనిగంటలు, పనిదినాలు తగ్గాలని వేర్వేరు దేశాలు ప్రయత్నిస్తున్నాయి. పోటీతత్వం, కఠినమైన పని వాతావరణంతో విసుగెత్తిన జపాన్ ప్రజలు... నైరాశ్యంలో మునిగిపోతున్నారు. ఈ పరిస్థితిని గమనించిన ప్రభుత్వం అక్కడి ఉద్యోగులకు నాలుగు రోజుల పనివారాన్ని అమలు చేసే ప్రయత్నంలో ఉంది. అంతేకాదు! పనిచేసే వాతావరణంలో జిమ్ లాంటి సౌకర్యాలు కల్పించాలని అటు యాజమాన్యాలనీ, సెలవులను కచ్చితంగా వినియోగించుకోమని ఇటు ఉద్యోగులను కోరుతున్నది. జర్మనీ, డెన్మార్క్, నెదర్లాండ్స్ తదితర దేశాల్లో వారానికి సగటు పనిగంటలు 35 కంటే తక్కువగా ఉన్నాయి. ఉత్తర అట్లాంటిక్, ఉత్తర ఐరోపాలోని కొన్ని దేశాల్లోని ప్రజల్లో సంతోషపు స్థాయి ఎక్కువని హ్యాపీనెస్ ఇండెక్స్ లాంటి నివేదికలు చెబుతున్నాయి. అందుకు ఒక ముఖ్యకారణం... వారి వ్యక్తిగత జీవితాన్ని దెబ్బతీయని విధంగా పనిగంటలు, పని వాతావరణం ఉండటమే అని చెబుతారు.